# ప్రయివేట్ సెక్రటరీ

"రాధాకృష్ణ"

[''కావాలి. 20 ఏళ్లు మించని వయస్సు కలిగిన విద్యావతి ప్రయివేట్ సెక్రటరీగా పని చెయ్యడానికి కావాలి'' అని ''బసంత్'' పత్రికలో పడిన ప్రకటనను మిస్ కోకిల బి.ఏ. పదిసార్లు చదివింది.]

తను బి. ఏ. ప్యాసయి, ఆరు మాసాలు దాటింది. ఎన్నో ఉద్యోగాలకోసం ప్రయత్నించింది. పత్రికల్లో పడ్డ ప్రతి ''వాంటెడ్'' ప్రకటనకు దరఖాస్తులు పంపింది. కొన్నిటికి జవాబులు రానేలేదు. కొన్నిటికి ఖాళీలు పూర్తి అయిపోయాయని జాబులు వచ్చాయి.

పోనీ, ఈసారికూడా యత్నిద్దామనుకుంది. అడ్రెస్ నోట్ చేసుకుంది. చిత్తరంజన ఎవెన్యూ - 22. పాల్ అండ్ కో అని వుంది.

కోకిల రిస్టువాచీవంక చూసింది. 9-30 అయింది. సరే. 10 గంటలకు గాని ఆఫీసును తెరవరు గదా టైముంది అనుకుంది.

తెల్లని చీర కట్టింది. గులాబీరంగు జాకెట్ తొడిగింది. తన అందాన్ని అద్దంలో చూచుకొని తనలో తనే నవ్వుకుంది. బస్సు ఎక్కి తిన్నగా చిత్తరంజన్ అవెన్యూ దగ్గర దిగింది.

ఆఫీసు కనుక్కోవడంలో కోకిల అట్టే కష్టపడలేదు.

దర్వాన్ ఆమెను చూచాడు. 'ఏమమ్మా? ఏమి పనిమీద వచ్చారు?' అన్నాడు.

'ఉద్యోగం కోసం' అని చెప్పింది.

''బాబుగారు ఇంకా రాలేదు. అలా బల్లమీద కూర్చోండి'' అన్నాడు దర్వాన్.

''ఇంకెవరూ గుమస్తాలు లేరా? ఇంకా రాలేదా?'' అని ప్రశ్నించింది కోకిల.

''లేరు. ఆయన ఒక్కరే పనిచూచుకొంటారు. ప్రతినెల ఒక్కొక్క అమ్మాయికి సెక్రటరీ ఉద్యోగం ఇస్తువుంటారు.''

''ప్రతినెలా ఒక్కొక్కరి కంటే—'' అని కోకిల వాక్యం పూర్తి చెయ్యకుండనే కారు వీధిలో ఆగడం, యజ... టక్‌టక్ మంటూ ఆఫీస్‌లోకి చక్కా రావడమూ జరిగాయి.

యజమాని గదితలుపుపై ''రంజిత్ మోహన్ భట్టాచార్జీ'' అని వుంది. ప్రక్కనే ''ఇన్—ఔట్'' అని ఒక చిన్న బోర్డు వుంది.

దర్వాన్ వచ్చి ఆమె దరఖాస్తును లోపలకు తీసుకువెళ్లాడు.

ఒక నిమిషంలో తిరిగి వచ్చి 'వెళ్లండి లోపలికి' అన్నాడు. చిరునవ్వుతో.

ఆమె గుండెలు కొట్టుకున్నాయి, ఇదే తొలి ఇంటర్వ్యూ, ఆ విధ ఉద్యోగం కోసం యత్నించిన సందర్భంలో.

తన అప్లికేషనంతా చదువుతూ బాబు ''మీ పేరు'' అన్నాడు ఆమెవంక చూడకుండానే.

''కోకిల'' అంది కోకిలలా సన్నని కంఠంతో.

''ఇది వరకు ఎక్కడైనా పనిచేశారా?''

''లేదండి.''

''మీ వయస్సెంత?''

''పందొమ్మిదేళ్లు సర్.''

ఆమెవంక ఒకసారి రెప్పవాల్చకుండా భట్టాచార్జీ చూశాడు.

తనలో తానే 'బాగానేవుంది. బి. ఏ. చదివింది. అందమైన చిన్నదే' అని గొణుగుకున్నాడు.

''ఎప్పాయింట్ చేశాను. జీతం నెలకు రెండు వందల రూపాయలు, ఎలవెన్స్ సహా''

''థ్యాంక్స్. ఎప్పుడు చేరమంటారు?''

''మీ ఇష్టం. ఇవాళే చేరవచ్చు. లేదా రేపు చేరండి.''

''సరే. రేపట్నుంచి వస్తాను. సరిగా 10-30కు రావచ్చునా?''

''నో. నో. మీరు నాకు మరి ప్రయివేటు సెక్రటరీ కాదూ? కేవలం ఆఫీస్ పనే కాదు— మా ఇంటికి కూడా రావాలి. ఉదయం ఒక గంట సాయంకాలం ఒక గంట ఇంటిదగ్గర వుంటే— వుత్తరాలు అవీ చూసి మరునాటి కార్యక్రమం యోచించుకోవచ్చు. ఆఫీసుకు మా యింటిదగ్గర నుంచి కారులోనే వస్తాం. కారులోనే వెళతాం.''

''సరే. అలానే వస్తాను. గుడ్ బై'' అని ఇంటికి వెళ్ళింది.

ఆమె సంధిగ్ధస్థితిలో పడింది. తన స్నేహితురాండ్రు ఒకరిద్దరితో చెప్పి, సలహా అడిగింది.

రాధ ఇలా అంది:

"వాడిదగ్గరా? అమ్మో. ఎక్కడా చెప్పకేం. నేను మోసపోయాను వాడికభుర్లకి. ఎంతమందిని నాశం చేశాడనుకున్నావు—ఛీ—దుర్మార్గుడు" అంది.

నాకు భయం కలిగింది. కాని, ఆతర్వాత తగినట్లు బుద్ధి చెప్పాలనిపించంది.

మరువాడు ఏడుగంట అయ్యేసరికే ఆయన ఇంటికి వెళ్లాను. రుస్సారోడ్ చివర వుంది ఆయన బంగళా. నాకోసం కనిపెట్టుక కూచున్నాడు. 'అందమైన చిన్నదే' అని తొలినాడు చేసిన రిమార్కు నాఒండెల్లో మెదుల్తోంది.

"రండి, కాఫీ తీసుకోందురు గాని ముందు." అన్నాడు.

"వద్దు సార్, కాఫీ త్రాగా" నన్నా.

"ఫర్వాలేదు, మరోకప్పు" అని బోయ్‌ని పిలిచి, తెప్పించి ఇచ్చాడు.

"ఇవాళ కేవలం కభుర్లే చెప్పుకుని, పరస్పరం పరిచయం చేసుకుంటాం. రేపటినుండి బిజినెస్" అన్నాడు.

"ఓ, అలాగే" అన్నా.

"మీ హాబీస్ ఏమిటి?" అన్నాడు.

"మ్యూజిక్—డాన్సింగ్" అన్నా.

"ఓ, మైగాడ్, సంగీతం అంటే చెవికోసుకుంటాను. మా ఆవిడ ఎంతో బాగా పాడేది. చనిపోయి ఆరేళ్లయింది. అప్పణ్ణించీ అన్‌మారీడ్‌గానే వుంటున్నా. అయితే కొత్తకనుక సిగ్గుపడుతారేమో ఆలా కాకుంటే ఒక్క చిన్న సాంగ్ విసరండి, లోన్లినెస్. కంపానియినషిప్ కోసమే నా దేవులాట."

"పోడానికి అభ్యంతరం లేదుగాని మూడ్ బాగాలేదండి. మా తల్లి సీద్ధాంలోవుంది. ఆవిడకు జబ్బుగా వుందనీ ఓ టూహండ్రెడ్ రుపీస్ వెంటనే పంపమని వుత్తరం వ్రాసింది. నేనేదో సంపాదించుకుంటున్నానని వాళ్ళ అనుమానం."

"వైవర్రీ? దానికేమి యీ మంత్స్ శాలరీ అడ్వాన్స్‌గా ఇస్తాను, తీసుకోండి. దానికేం," అని లోపలినుంచి చెక్కుబుక్కు తెచ్చి, చెక్కు రాసి ఇచ్చాడు.

"వెళ్లి చెక్కు మార్చుకుని అక్కడకు సొమ్ము పంపండి. వీలైతే ఈవెనింగ్‌కు ఇక్కడికే వచ్చెయ్యండి, ఫిర్పోలో కాఫీ త్రాగి, మెట్రోకు పోదాం." అన్నాడు.

ఆ సాయంకాలం కోకిల భట్టాచార్జీ ఇంటికి వెళ్ళలేదు. మరునాడు ఆయన తన బంగళాలో కూర్చుని కోకిల రాలేదేమీ అనుకుంటూండగ పోస్టులో ఒక కవరు వచ్చింది. ఇందులో ఇలా వుంది.

"డియర్ భట్టాచార్జీ, చాలా సంతోషం, మీరు చేసిన సహాయానికి. ఇలా ఎంతమంది అమాయక యువతులను "ప్రయివేట్ సెక్రెటరీ" పేరుతో మీరు మీ ప్రణయాపిపాసకి బలిఇచ్చారు? ఇప్పుడైనా కట్టిపెట్టండి. మీ చేష్టల్ని. ఇదే నా రాజినామా ఉత్తరంగా భావించండి."

భట్టాచార్జీ కుర్చీలో అలానే కూర్చుండి పోయాడు ఆ ఉత్తరం కేసిచూస్తూ......

షర్టింగులు, కోటింగులు, చీరలు, పంచలు మొదలైన అందమైన, నమ్మికగల చేనేత వస్త్రాలు కంట్రోలు వెలలకు దొరకును.

Prabhat

HANDLOOM TEXTILES, MADURA

ప్రభాత్ హేండ్‌లూమ్ టెక్స్‌టైల్స్,

నవబత్ ఖానా స్ట్రీట్, మధుర.